


ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్ రూరల్, జనవరి 3: శంషాబాద్ విమానాశ్రయంలో అక్రమంగా తెచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఓ ప్రయాణికుడు కువైట్ నుంచి శంషాబాద్ చేరుకున్నాడు. కస్టమ్స్ తనిఖీల్లో అతడి వద్ద 559 గ్రాముల బంగారం పట్టుబడింది. బంగారాన్ని ముక్కలుగా చేసి తేగా అధికారులు పట్టుకున్నారు. బంగారం విలువ రూ.33.12లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్నారు.



గొర్రెల పంపిణీ వివరాలు

సొసైటీలు	368
సభ్యులు	41,964
మొదటి విడత లక్ష్యం	20,297
పంపిణీ చేసిన యూనిట్లు	11,685

గొర్రెల యూనిట్లు ఇప్పుడిస్తాం.. అప్పుడిస్తాం అంటూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెల కాపరుల నుంచి డీడీలు కట్టించుకుందే గానీ చాలా మందికి యూనిట్లు పంపిణీ చేయలేదు. మొదటి విడత లక్ష్యంలో 40శాతానికి పైగా పెండింగ్ పెట్టిన గత సర్కార్.. ఎన్నికలకు ముందు రెండో విడత పంపిణీ కోసమంటూ పెంచిన యూనిట్ కాస్ట్‌తో డీడీలు కట్టించుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నామమాత్రంగా పంపిణీ చేసి మమ అన్పించింది. తీరా ఎన్నికల్లో పాత ప్రభుత్వం పోయి కొత్త పాలకులొచ్చారు. అప్పులు చేసి డీడీలు చెల్లించిన తమకు గొర్రెలయినా ఇవ్వండి లేదా.. డీడీల కోసం కట్టిన డబ్బయినా తిరిగివ్వండి అని గొల్ల కురుమలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని గొర్రెల కాపరులు కోరుతున్నారు.

గొర్ల కోసం ఎదురుచూపులు!

రెండో విడత లక్ష్యం : 30,009
డీడీలు చెల్లించిన వారి సంఖ్య : 2,000 (రూ.8.75కోట్లు)
పంపిణీ చేసిన యూనిట్లు : 1,342
పంపిణీ చేయాల్సిన యూనిట్లు :700
(చెల్లించిన డీడీల విలువ రూ.3.06కోట్లు)

- అంతంత మాత్రంగా మొదటి విడత పంపిణీ
- రెండో విడత పంపిణీ చేసినవి 1,342 యూనిట్లే!
- అప్పు చేసి డీడీలు చెల్లించిన గొల్ల కురుమలు
- కొత్త సర్కార్ యూనిట్లు ఇస్తుందని కోటి ఆశలు

రంగారెడ్డి అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇదిగో గొర్రెలు.. అదిగో గొర్రెలంటూ గత బీఆర్‌ఎస్ సర్కార్ ఊరించి.. ఊరించి చివరకు గొల్ల కుర్మలకు అరకొర గొర్రెల యూనిట్లు పంపిణీ చేసింది. మొదటి విడత నామ మాత్రంగానే గొర్రెలు పంపిణీ చేశారు. కనీసం రెండో విడతలోనైనా గొర్రెలొస్తాయని చూసిన డీడీలు కట్టిన కాపరులకు నిరాశే ఎదురైంది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో కొందరికి గొర్లు ఇచ్చారు. అంతలోనే ఎన్నికల కోడ్ వచ్చి పంపిణీ నిలిచింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో గొర్రెల కోసం డీడీలు చెల్లించిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాపరులు వందకు మూడు రూపాయల చొప్పున వడ్డీకి తెచ్చి యూనిట్‌కు రూ.43,750 చొప్పున చెల్లించారు. నెలలు గడుస్తున్నా గొర్రెలు రాలేదు. డీడీలైనా తిరిగి ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమకు యూనిట్లు పంచుతుందని గొల్ల కురుమలు ఆశపడుతున్నారు. జిల్లాలో 368 సొసైటీల్లో 41,964 సభ్యులున్నారు. మొదట 20,297 యూనిట్లు పంపిణీ లక్ష్యంగా పెట్టుకోగా 11,685 యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో పంపిణీ అంతంత మాత్రంగానే జరిగింది. రెండో విడత

యూనిట్ల పంపిణీకి కాపరుల నిరీక్షణ

లక్ష్యం 30,009 యూనిట్లు. 2 వేల మంది రూ.8.75కోట్ల విలువగల డీడీలు చెల్లించారు. 1,342 యూనిట్లను దశాబ్ది ఉత్సవాల్లో పంపిణీ చేశారు. మరో 700మంది రూ.43,750 చొప్పున రూ.3,06,25,000 చెల్లించారు. అయితే గొర్లను పంపిణీ చేయలేదు.

నెరవేరని బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం

జిల్లాలో గొల్ల, కుర్మల కుటుంబాలు అనేకం ఉన్నాయి. 2018 నుంచి ప్రభుత్వం రాయితీపై గొర్లు కొనివ్వడం మొదలు పెట్టింది. 18ఏళ్ల నిండి సొసైటీలో సభ్యత్వం ఉన్న వారు అర్హులు. లబ్ధిదారుల ఎంపికలో కలెక్టర్ ఛైర్మన్‌గా, పశుసంవర్ధకశాఖ అధికారి కన్వీనర్‌గా ఉండేవారు. యూనిట్ల ఎంపిక, కొనుగోలు బాధ్యత మండల కమిటీదే. ఆడ గొర్రెలు, పొట్టేళ్లను పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసేవారు. మండల కమిటీలో ఎంపీడీవో, తహసీల్దార్, పశువైద్యాధికారి ఉంటారు. గొర్లు కొనేందుకు వెళ్లే సమయంలో లబ్ధిదారులై సైతం అధికారుల వెంట వెళ్లాలి. రవాణా, బీమా ఖర్చులు ప్రభుత్వం భరిస్తుంది. వెటర్నరీ అధికారి గొర్లను పరిశీలించి ఆరోగ్యంగా ఉన్న వాటిని ఓకే చేస్తే అమ్మకందారులకు అధికారులు బ్యాంకుల ద్వారా చెల్లింపులు చేస్తారు. మొదటి విడత అక్రమాలు జరిగాయని ఆరోపణలొచ్చాయి. సబ్సిడీ గొర్లు తీసుకున్న కొన్నాళ్లకే అమ్మేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఇదిలా ఉంటే యూనిట్లకు అవసరమైన మేరకు గొర్రెలు, మేకలు స్థానికంగా దొరకక కర్ణాటక, మహారాష్ట్రల నుంచి దిగుమతి చేసుకున్నారు. దీంతో ఆ రాష్ట్రాల్లో గొర్లకు డిమాండ్ పెరిగింది. అలాగే డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో రవాణా భారం పడింది. కరోనా కాలంలో ప్రభుత్వం సబ్సిడీ భరించడం కష్టంగా మారింది. ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడు గొర్రెల ధర తక్కువగా ఉంది. క్రమేణా అన్ని ధరలూ పెరిగాయి.



పెరిగిన యూనిట్ ధర

గతంలో యూనిట్ ధర రూ.1.25లక్షలు. బ్యాంకులతో సంబంధం లేకుండా 70శాతం సబ్సిడీతో మంజూరు చేశారు. లబ్ధిదారుడు రూ.31,250, ప్రభుత్వం 93,750 భరించారు. ఒక్కో యూనిట్‌కు 20గొర్రెలు, ఒక పొట్టేలుకు చొప్పున అందజేశారు. పెరిగిన ధరల నేపథ్యంలో గత ప్రభుత్వం యూనిట్ కాస్ట్ రూ.1.75లక్షలకు పెంచి లబ్ధిదారుల వాటా యూనిట్‌కు రూ.43,750 చెల్లించాలని నిర్ణయించింది.

అప్పు చేసి డీడీ కట్టాను



గొర్రెలు వస్తాయంటే.. ఊళ్లో వందకు మూడు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి డీడీ కట్టాను. ఇప్పటి వరకు గొర్రెలు ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. మాకు గొర్రెలు త్వరగా పంపిణీ చేయాలి. లేకుంటే మేం కట్టిన డబ్బులు వాపస్ ఇవ్వాలి.

\- నాగరాజు, రామన్నగూడ, చేవెళ్ల మండలం

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం



నాలుగేళ్లుగా గొర్రెల కోసం ఎదురు చేస్తున్నాం. మొదటి విడత ఇస్తారనుకుంటే ఇవ్వలేదు. రెండో విడత డీడీలు కూడా చెల్లించారు. డీడీలు కట్టి ఆరునెలలు అయిపోయింది. ఎన్నికలకు ముందు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండో విడత అరకొరగా గొర్రెలను పంపిణీ చేసి చేతులు దులుపుకుంది. చాలా మందివి గొర్రెల ఇస్తారని ఎదరుచూస్తున్నాం. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా కష్టాలు చూసి డీడీలు కట్టిన వారికి వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలి.

\- ఈరమోళ్ల మల్లయ్య, చేవెళ్ల

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం



జిల్లాలో మొదటి విడత 11,685 యూనిట్లు పంపిణీ చేశాం. రెండో విడత 1,342గొర్రెల యూనిట్లను పంపిణీ చేశాం. మరో 700 మంది లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీరంతా డీడీలు చెల్లించారు. ప్రభుత్వం ఆదేశిస్తే గొర్రెలను పంపిణీ చేస్తాం.

\- అంజిలప్ప, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

జిల్లా కలెక్టర్‌గా శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 3 : తెలంగాణలో నూతన ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు పాలనపర నిర్ణయాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్నారు. ప్రభావవంత పాలన అందించేందుకు, సంక్షేమ పథకాల అమలు పూర్తి స్థాయిలో అమలయ్యేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం భారీస్థాయిలో ఏఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. 26మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన కె.శశాంకను రంగారెడ్డి కలెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయి ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఉన్న గౌతమ్ పొట్రును ప్రభుత్వం రిలీవ్ చేసింది. కొత్త కలెక్టర్ 2013 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. శశాంక 2014 నుంచి 2016 డిసెంబరు వరకు జగిత్యాల సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. 2016 డిసెంబరు నుంచి 22నెలలు కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా, జోగులాంబ-గద్వాల్ కలెక్టర్‌గా పనిచేశారు. శశాంక స్వస్థలం ఉమ్మడి నల్లగొండ జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల. మేనమామ సొంతూరు బిజులాపురంలో ఉండి మోత్కూరులో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఆయన సతీమణి సింధూశర్మ ఐపీఎస్‌గా పనిచేస్తున్నారు.



మూడు నెలల్లో ముగ్గురు కలెక్టర్లు!

జిల్లాకు మూడు నెలల్లోనే ముగ్గురు కలెక్టర్లు మారారు. డిసెంబరులో నిర్వహించిన శాసనసభ ఎన్నికల సమయంలో అప్పటి కలెక్టర్ హరీష్‌ను ఈసీ బదిలీ చేసింది. కొత్త కలెక్టర్‌గా భారతి హొలికేరి అక్టోబరు 13న బాధ్యతలను చేపట్టారు. కలెక్టర్ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న 98 దస్త్రాలు కలెక్టర్ ఆమోదం లేకుండానే ధరణిలో ఆమోదం లభించింది. ధరణిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని కొత్త ప్రభుత్వం భారతిని బదిలీ చేసింది. ఆమె 2నెలల 11రోజులు కలెక్టర్‌గా పనిచేశారు. ఆమె స్థానంలో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు రంగారెడ్డి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన డిసెంబరు 24 నుంచి జనవరి 3 వరకు విధులు నిర్వహించారు. తాజాగా జరిగిన ఐఏఎస్ బదిలీల్లో మహబూబాబాద్ కలెక్టర్‌గా ఉన్న కె.శశాంకను రంగారెడ్డి కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.



రాఘవేందర్‌రెడ్డి



బాలాజీసింగ్

నామినేటెడ్ ఆశలు

- పదవుల కోసం క్యాడర్ ఎదురు చూపు
- సీఎం ప్రకటనతో నేతల్లో ఆశలు
- ఎమ్మెల్సీ పదవికి బాలాజీ, సుంకిరెడ్డి, ఆయిళ్ల, సూదిని, భట్టు యత్నాలు



ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్



సూదిని రాంరెడ్డి



భట్టు కిషన్‌రెడ్డి

ఆమనగల్లు, జనవరి 3: నామినేటెడ్ పదవుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఏళ్లుగా పార్టీలోనే ఉన్న తమను అధిష్ఠానం, ముఖ్యమంత్రి గుర్తిస్తారన్న ధీమాలో నాయకులున్నారు. రద్దైన కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, ఇతర నామినేటెడ్ పోస్టులను సంక్రాంతి నాటికి భర్తీచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండడంతో ఈ ప్రాంత నేతలకు పదవుల్లో పెద్దపీట వేస్తారని ఆశిస్తున్నారు. పలువురు నేతలు ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. కేంద్ర అధిష్ఠానం వద్ద పలుకుబడి ఉన్న వంశీ మద్దతుంటే పదవి పక్కా అని ఆయన ప్రాపకానికి పాకులాడుతున్నారు. పోస్టులకు నేతల ఎంపికలో విషయంలో వంశీ జోక్యం చేసుకుంటారా? లేక ఎమ్మెల్యే కసిరెడ్డి నిర్ణయానికే వదిలేస్తారా? అన్న చర్చా సాగుతోంది. గతంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ఎమ్మెల్సీకి రాజీనామా చేశారు. ఖాళీ అయిన ఆ పదవిని కల్వకుర్తి నియోజకవర్గానికే కేటాయిస్తారని నాయకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ నేత, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌ఛైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ కార్యదర్శి, మాడ్గుల మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెంచుకున్నారు. ఒక వేళ స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఎన్నిక నిర్వహిస్తే ఖర్చుతో కూడుకున్నది. అయితే తమ ప్రభుత్వమే ఉండడంతో ఎమ్మెల్సీ పదవి చేజిక్కించుకోవచ్చనే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వాన్ని దక్కించుకునేందుకు నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. అలాగే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, డైరెక్టర్ పదవులు, మార్కెట్, ఆలయాల ఛైర్‌పర్సన్ పదవులు పొందేందుకు ద్వితీయశ్రేణి నాయకులు ఆరాటపడుతున్నారు. పార్టీకి తామందిస్తున్న సేవలను గుర్తించాలని నాయకులు అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

జడ్పీ చైర్మన్ పరామర్శ


సంతాపం తెలుపుతున్న శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 3: ఘట్‌కేసర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు సుధాకర్‌రావు మాతృమూర్తి రుక్కమ్మ బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. తారు మరిచారు

● ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని వాహనదారుల వినతి


బషీరాబాద్-తాండూరు ఆర్అండ్‌బీ మార్గంలో అగ్గనూరు వద్ద కంకర పరిచి అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

బషీరాబాద్, జనవరి 3: బషీరాబాద్-తాండూరు ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు మార్గం అగ్గనూరు సమీపంలో రహదారి పనితీరుకు అద్దం పడుతోంది. గుంతలమయంగా మారిన ఈ మార్గాన్ని పునరుద్ధరించేందుకు కాంట్రాక్టర్ కిలో మీటరుకు పైగా తారు తొలగించి కంకర పరిచారు. గత మూడు నెలల కిందట కంకర పరిచిన కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో తమకు ఇబ్బందిగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గుండా నిత్యం 50 గ్రామాల నుంచి ప్రజలు పలు రకాల వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కంకర పరిచిన రోడ్డుపై ద్విచక్ర వహనాలపై వెళ్లాలంటే అక్కడా వెలువడుతున్న దూమ్ముతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి పనుల పూర్తికి తగిన చర్యలు తీసుకోవాలని ద్విచక్ర వాహనదారులు పలువురు విన్నవిస్తున్నారు.

మంత్రి పొంగులేటికి పూర్వ వీఆర్‌ఏల సన్మానం


రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పూర్వ వీఆర్ఏలు

వికారాబాద్, జనవరి 3: వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న పూర్వ వీఆర్‌ఏలకు వెంటనే ఐడీలు కేటాయించి పెండింగ్‌లో ఉన్న అయిదు నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ హక్కుల సాధన సమితి, రాష్ట్ర వీఆర్‌ఏల జేఏసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం వారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌లను కలిసి సన్మానించి ధన్యవాదాలు చెప్పారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పూర్వ వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించి 20వేల కుటుంబాల్లో సంతోషం నింపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పూర్వ వీఆర్‌ఏల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేశారంటూ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన చైర్మన్ విజయ్‌తో పాటు సమితి కన్వీనర్ సత్యనారాయణ, నాయకులు చిరంజీవి, సంకీర్తన, సునీత, సరోజ, శ్రీధర్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కడా ప్రత్యేకాధికారిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్, జనవరి 3: కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారి కుంచాల వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, సభ్యులు యం.వెంకటేశం, ఏ.రమేష్, జీ.రాము, కృష్ణ, కృష్ణంరాజు, బాబు, గోపాల్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.


కడా ప్రత్యేకాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పింఛన్ల పంపిణీలో డబ్బులు తీసుకున్నాడని..

● అధికారుల విచారణ

తాండూరు రూరల్, జనవరి 3: తాండూరు మండలం కరన్‌కోట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ పింఛన్ల పంపిణీలో డబ్బులు తీసుకున్నాడనే ప్రజాపాలనలో వచ్చిన ఫిర్యాదుపై అధికారులు బుధవారం విచారణ జరిపారు. జిల్లా డీఆర్‌డీఏ డీపీవో నర్సింహులు, తాండూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాకేష్‌రెడ్డిలు కరన్‌కోట్ గ్రామానికి వెళ్లి గ్రామ సర్పంచ్ వీణ, ఉపసర్పంచ్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను పిలిచి విచారణ జరిపారు. అయితే, క్షేత్రస్థాయిలో తాము విచారణ జరుపగా ఎలాంటి ఆధారాలు లభించలేదని అధికారులు తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు డీఆర్డీఏ డీపీవో నర్సింహులు, తాండూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాకేష్‌రెడ్డిలు తెలిపారు.

మైల్వార్ గ్రామ కార్యదర్శికి షోకాజ్ నోటీస్

బషీరాబాద్, జనవరి 3: మండలంలోని మైల్వార్ గ్రామ కార్యదర్శి నర్సింహాగౌడ్‌కు జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బషీరాబాద్ ఎంపీడీవో రమేష్ బుధవారం ఈ విషయాన్ని ధృవీకరించారు. మైల్వార్ గ్రామంలో మంగళవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామసభనుద్దేశించి మాట్లాడుతుండగా మైక్‌సెట్ పలుమార్లు మొరయించింది. దీంతో ఎమ్మెల్యే అక్కడున్న అధికారులపై మైక్‌సెట్‌ను కూడా సరగా చూసుకోరా అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం గ్రామ సభల నిర్వహణకు రూ.10వేలు ఇస్తుండగా కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశానుసారం డీపీవో తరుణ్‌కమార్ అదేరోజు సాయంత్రం కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీచేస్తూ మెయిల్ చేశారు.

దేవేందర్‌గౌడ్ నివాసానికి కేంద్ర మంత్రి

మహేశ్వరం, జనవరి 3 : కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్‌జోషి బుధవారం తుక్కుగూడలో మాజీ ఎంపీ టి.దేవేందర్‌గౌడ్‌తో పాటు ఆయన కుమారుడు వీరేందర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు దేవేందర్‌గౌడ్ నివాసంలో కలిసిన ప్రహ్లాద్ జోషి వారితో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, రానున్న పార్లమెంటు ఎన్నికలపై చర్చించినట్లు సమాచారం.

నేడు మాణిక్యమ్మగూడకు కేంద్ర మంత్రి రాక

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా నేడు(గురువారం) మండల పరిధిలోని మాణిక్యమ్మగూడకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పర్యటించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈమేరకు వివిధ శాఖల అధికారులు గ్రామంలో తగిన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిద్దె సుదర్శన్‌రెడ్డి, మాధవాచారి, భూపాల్‌రెడ్డి, చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దేవేందర్‌గౌడ్‌తో సమావేశమైన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



గుప్తనిధుల కోసం తవ్వకాలు

ఫాంహౌస్ యజమానిని ప్రశ్నించిన పోలీసులు

శంషాబాద్ రూరల్, జనవరి 3: శంషాబాద్ మున్సిపల్ పరిధి తొండుపల్లిలో గల ఓ ఫాంహౌస్‌లో మంగళవారం అర్ధరాత్రి గుప్తనిధుల తవ్వకాలు జరిపారు. 20 ఫీట్ల లోతు సొరంగం తవ్వారు. తవ్వకాలు చేసిన చోట్ల నిమ్మకాయలు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలతో క్షుద్రపూజలు చేశారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. ఫాంహౌస్ యాజమాని ముక్తార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. భూమిలో రంగురాళ్లు ఉన్నట్లు ఎవరో చెబితే తవ్వకాలు చేశామని అతడు ఒప్పుకున్నాడని సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు. రెండుచోట్ల తవ్వకాలు చేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయని సీఐ తెలిపారు. కాగా ఘటనపై తమకు సమాచారం ఇచ్చారు తప్పితే ఎవరూ ఫిర్యాదు చేయాలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని సీఐ వివరించారు.



మాడ్గుల : మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, జనవరి 3: పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆయా చోట్ల పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను గ్రామ స్థాయికి తీసుకుపోయిన ఘనత సీఎం రేవంత్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేద కుటుంబాలందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీవో రాఘవులు, డీటీ రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుడు కొత్తపాండు గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ మహేష్, వెంకట్‌రాంరెడ్డి

సాయిరెడ్డిగూడకు బస్సు సౌకర్యం కల్పించాలి


కందుకూరు, జనవరి 3 : సాయిరెడ్డిగూడకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలి సర్పంచ్ మహేష్, ప్యాక్స్ డైరెక్టర్ ఎస్.వెంకట్‌రాంరెడ్డిలు బుధవారం తహసీల్దార్ కె.గోపాల్, ఎంపీడీవో వెంకట్రాములకు వినతి పత్రం ఇచ్చారు. బుధవారం ఉదయం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సభకు అధికారులు వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధికారులకు సమస్యను విన్నవించారు. తమ గ్రామానికి 20 ఏళ్లుగా మిధాని డిపోకు చెందిన బస్సు నగరం నుంచి వచ్చేదన్నారు. ఇటీవల బస్సు సర్వీసు నిలిపివేయడంతో గ్రామస్తులు, రైతులు, పాల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాగా, ఎంపీడీవో వెంకట్రాములు మాట్లాడుతూ బుధవారం మండలంలోని సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి, కొత్తూరు, గూడూరు. పెద్దమ్మతాండ, దావుత్‌గూడ తండాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. సర్పంచ్‌లు మహేష్, రజితప్రవీణ్‌నాయక్, పల్లె వసంత కృష్ణగౌడ్, సుమన్‌నాయక్, అనిత, ఎంపీటీలు ఇందిరదేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పరిగి, జనవరి 3: ఎస్టీయూ 2024 క్యాలెండర్‌ను బుధవారం పరిగిలో ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేసి మంచి ఫలితాలు తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.బసిరెడ్డి, జిల్లా ప్రతినిధులు కనకచారి, దయాకర్, యాదయ్య, అంజిలయ్య, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అందె బాబయ్య

మోదీ విజన్‌తో అందరికీ సంక్షేమ పథకాలు

కేశంపేట, జనవరి 3: ప్రధాని మోదీ విజన్‌తో ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య వివరించారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బాబయ్య మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ప్రధాని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శివాజీ, యుగందర్, రాఘవేందర్, జాహిద్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు!

» సీసీ కెమెరాలున్నా ఫలితం సున్నా

» కూడళ్లు, రోడ్ల వెంట ఉన్న సీసీ కెమెరాలు మూలకు

» పట్టించుకోని అధికారులు



నందిగామ బైపాస్ రోడ్డులోని కూడలిలో పనిచేయని సీసీ కెమరాలు

నందిగామ, జనవరి 3: ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కానీ ప్రతీ క్షణాన్ని వీడియోలో నిక్షిప్తం చేసేలా ఏర్పాట్లుంటే దేన్నైయినా విశ్లేషించడం సులువు. ముఖ్యంగా నేర సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న సమయాల్లో పోలీసు విచారణకు వీడియో రికార్డుల ఫుటేజీలు ఎంతో ఉపయోగపడుతాయి. అందుకే పోలీసు శాఖ, ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా రోడ్ల వెంట, ప్రభుత్వం ప్రైవేట్ కార్యాలయాల్లో ఈ కాలంలో సీసీ కెమెరాలు, టీవీల వాడకం సాధారణం. ఇంత కీలకమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు కానీ వాటి నిర్వహణపై పట్టించుకునే నాథుడు లేడు. నందిగామ మండలంలో దాతలు, ప్రజాప్రతినిధుల విరాళాలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మూలనపడ్డాయి. ముఖ్యంగా వాటి నిర్వహణను పంచాయతీలు, అధికారులు పట్టించుకోకే ఈ పరిస్థితి దాపురించింది. చౌరస్తాలు, పట్టణ, గ్రామ ముఖ ద్వారాలు, రద్దీ ప్రదేశాల్లో, రోడ్లపై విరివిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి నిర్వణను గాలికొదిలేయడంతో అందరి ప్రయత్నం, డబ్బు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. నేరాల అదుపునకు సీసీ కెమెరాలను ఏర్పాటును అందరూ ప్రోత్సహించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ప్రజల్లో అవగాహన కల్పించి నివాసాలు, వ్యాపార కేంద్రాల్లో సీసీ కెమెరాలు, టీవీలను ఏర్పాటు చేయించినా నిర్వహణ లేక ఫలితం లేకుండా పోతోంది.

సీసీ కెమెరాలున్నాయి.. కానీ పనిచేయవు!

మండలంలో పరిశ్రమల్లో తప్ప ఎక్కడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కొన్ని రోజుల క్రితం పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి చంద్రయ్య అనే రైతు గాయపడ్డాడు. అయితే అతడి బైక్‌ను ఢీకొన్న వాహనాన్ని పోలీసులు గుర్తించలేకపోయారు. కారణం అక్కడున్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడం. నందిగామ చౌరస్తా వద్ద ఉన్న సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే ప్రమాదానికి కారణమైన వారు తెలిసిపోయేవారు. దీంతో రైతుకు చికిత్సకయ్యే ఖర్చును ఢీకొన్న వాహనదారు భరించడంతో పాటు రైతుకు జరిగిన నష్టానికి సైతం పరిహారం అందేది. సీసీ కెమెరాలు పనిచేయక రైతుకు న్యాయం జరగలేదు. అలాగే నందిగామ బైపాస్‌రోడ్డులో నందిగామకు చెందిన యూసుఫ్ రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని మృతిచెందాడు. అక్కడా సీసీ కెమెరాలున్నా పనిచేయకపోవడంతో ప్రమాద కారకులు తెలియలేదు. మండలంలోని రంగాపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమరాలు పనిచేయక గతంలో గ్రామపంచాయతీ ట్రాక్టర్ అపహరించిన దొంగలు పట్టుబడలేదు. నందిగామ మండలం పారిశ్రామిక ప్రాంతం. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ ఉపాధి కోసం వస్తుంటారు. ఇటువంటి చోట్ల నేరాలు జరిగే ఆస్కారం ఎక్కువ. కూడలి ప్రదేశాలు, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, టీవీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలం చెల్లిన సీసీ కెమెరాలను మార్చి కొత్తవి అమర్చాలి. అధికారులు, పోలీసులు పట్టించుకుంటేనే ఇవన్నీ సాధ్యం. సీసీ కెమెరాల ఏర్పాటు వెనుక ఉన్న లక్ష్యం నెరవేరేదీ ఇప్పుడే!

సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యం



ప్రస్తుతం సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ అవశ్యం. 2నెలల క్రితం నందిగామలో జంట హత్యలు జరిగాయి. సీసీ కెమెరాలుంటే హంతకులను పట్టుకునే అవకాశం ఉండేది. సీసీ కెమెరాలతో నేరాల అదుపు కూడా సాధ్యమే. నందిగామ పెద్ద పారిశ్రామిక వాడ. నేరస్థులు ఇలాంటి ప్రదేశాలను అడ్డాగా చేసుకుంటారు. కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నేర నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- విక్రమ్‌శర్మ, న్యాయవాది, నందిగామ

కెమెరాలు పనిచేసేలా చూస్తున్నాం



ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు నిర్మాణంలో కేబుల్స్ కట్ అయి కొన్ని కెమెరాలు పనిచేయడం లేదు. నేరాలకు పాల్పడే వారు సమీపంలో సీసీ కెమెరాలు ఉన్నాయా? లేదా? అని గమనిస్తున్నారంటే అవి ఎంత కీలకమో తెలుస్తోంది. అన్ని ఫ్యాక్టరీలు, ఆలయాలు, దుకాణాలు, స్కూళ్లు, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. వాటిని పోలీస్‌స్టేషన్ల నుంచి మానిటరింగ్ చేస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి.

- సురేష్, ఇన్‌స్పెక్టర్, నందిగామ

మంత్రి సురేఖకు జడ్పీటీసీ శుభాకాంక్షలు



కేశంపేట, జనవరి 3: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలాశ్రవణ్‌రెడ్డి బుధవారం పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో మంత్రి చాంబర్‌లో జడ్పీటీసీ దంపతులు సురేఖను కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



హిమాయత్ నగర్‌లో నిర్మాణాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అక్రమ నిర్మాణాల తొలగింపు

మొయినాబాద్ రూరల్, జనవరి 3 : మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి జేసీబీల సహాయంతో బుధవారం తొలగించారు. గ్రామంలోని సర్వేనెంబర్ 145లోని 9 ఎకరాల భూమిలో నగరానికి చెందిన కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి సిబ్బంది, జేసీబీల సహాయంతో అక్కడికి చేరుకొని నిర్మాణాలను తొలగించారు. ఈ నిర్మాణాలు చేపట్టిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అయితే గతంలో ఇదే స్థలం విషయంలో హైకోర్టులో కేసు కొనసాగింది. తీర్పు ఒక వర్గానికి అనుకూలంగా వచ్చినా.. మరో వర్గానికి చెందినవారు అప్పటి ప్రభుత్వంలోని కొందరి పెద్దల సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతిభ ఆధారంగానే గుర్తింపు

తలకొండపల్లి, జనవరి 3: ప్రతిభ ఆధారంగానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న స్పందన ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాల ఆవరణలో స్పందనకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో స్పందనను సత్కరించి అభినందించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు. జడ్పీ కో-ఆప్షన్‌సభ్యుడు ముజుబుర్ రహెమాన్, సర్పంచ్ సంగీత, హెచ్‌ఎం రజాక్, శేఖర్, లీల, పీఈటీ పరమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిష్యుడు ఎమ్మెల్యే కావడమే గొప్ప గురుదక్షిణ

షాద్‌నగర్ అర్బన్, జనవరి 3: తన శిష్యుడు వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే కావడమే గొప్ప గురుదక్షిణ అని ఆయనకు విద్యాబుద్ధులు చెప్పిన గురువు అన్నారు. ఈమేరకు వీర్లపల్లి ఎమ్మెల్యే అయ్యాడన్న ఉత్సాహంతో స్వయంగా శిష్యుడి ఫొటోను చిత్రీకరించి బహూకరించి, ఆశీర్వదించి, ఆనందించాడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపాలస్వామి. బుధవారం ఆయన స్వయంగా శంకర్ ఇంటికి వెళ్లి ఫొటో బహూకరించి ఆశీర్వదించాడు. చిన్ననాటి గురువు, తన ఫొటోను చిత్రీకరించి ఇవ్వడంతో ఎమ్మెల్యే ఆనంద బాష్పాలతో గురువుకు పాదాభివందనం చేశారు. కాగా, షాద్‌నగర్ పట్టణంలోని క్రిష్టియన్ కాలనీకి చెందిన గోపాలస్వామి నందిగామ పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో వీర్లపల్లి అదే పాఠశాలలో చదువుకున్నాడు. పాఠశాలలో శంకర్ చురుకుదనం, సమయస్ఫూర్తిని చూసి గొప్పగా ఎదుగుతాడని భావించానని, నా ఆలోచనకు అనుగుణంగా ఎమ్మెల్యే కావడం, గురువుకు అంతకన్నా గొప్ప ఆనందం ఏముంటుందని గోపాలస్వామి అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యే వీర్లపల్లికి ఎంపీపీ సన్మానం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలను బీఆర్ఎస్‌కు చెందిన ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీష్ సన్మానించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీని వారు సన్మానించి, స్వీటు తినిపించారు. ఈ దృశ్యాలు అక్కడున్న కాంగ్రెస్ నాయకులకు ఆనందాన్ని కల్గించాయి.



ఎమ్మెల్యే శంకర్‌కు ఫొటోను బహూకరిస్తున్న గురువు గోపాలకృష్ణ

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం



శంకర్‌పల్లి : మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి/మొయినాబాద్/మొయినాబాద్ రూరల్, జనవరి 3 : నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలో దాతలు అనంతరెడ్డి రూ.15లక్షలు, కెప్టెన్ కిషన్ రూ.5లక్షల సమకూర్చగా.. 110 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, దోపిడీలు అరికట్టేందుకు ఒక్క కెమెరా వంద మంది జవాన్లతో సమానమన్నారు. కాలనీల్లో, ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను సీఐ వినాయకరెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రష్మీసాధన పెరుమాల్, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐలు నాగరాజు, ఎస్ఐలు సంతోషరెడ్డి, సత్యనారాయణ, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకమని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. మొయినాబాద్ నూతన సీఐగా పవన్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన చిలుకూరు బాలాజీ దేవాలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగరాజన్ సీఐకి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం రంగరాజన్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతం కావడంతో నిత్యం శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంటుందని, అన్ని వర్గాల కృషితో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కొడంగల్, జనవరి 3: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. కొడంగల్ మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఊరడమ్మ ఆలయ పునర్నిర్మాణం, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మొండిగౌరెల్లిలో క్వారీలు, క్రషర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం

» ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

యాచారం, జనవరి 3 : మండలంలోని మొండిగౌరెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 19లో క్వారీలు, క్రషర్లు ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. రెండు రోజులుగా కంటైనర్‌తో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు క్వారీలు, క్రషర్ల యజమానులు చకచకా పనులు సాగిస్తున్నారు. కాగా, ఎన్నికల ముందు గ్రామంలో మైనింగ్‌జోన్ ఏర్పాటు చేయనిచ్చేదిలేదని చెప్పిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు.. నేడు మాట మార్చారు. క్వారీలు, క్రషర్ల యజమానులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వం నుంచి అనుమతి ఉందని నమ్మించే యత్నం చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. నాయకులు ఎన్నికల వేళ ఒక మాట.. ఎన్నికలు ముగిసిన తరువాత మరో మాట చెబుతూ జనాలను మోసం చేస్తున్నారని మొండిగౌరెల్లి, యాచారం, గునగల్, గడ్డమల్లాయగూడ గ్రామాల రైతులు ధ్వజమెత్తుతున్నారు. ఈ సర్వేనెంబర్‌లో క్వారీలు, క్రషర్లు పెడితే వ్యవసాయం చేయలేమని, వందలాది ఎకరాల అసైన్డ్, పట్టాభూములు బీళ్లుగా మారుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతోనే మైనింగ్ జోన్ కింద పనులు చేసుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మైనింగ్‌జోన్ కింద పనులు చేసేముందు ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు చేయలేదని రైతులు మండిపడుతున్నారు. కాగా, మైనింగ్ అధికారులు తక్షణమే యాచారం మండలంలో పర్యటించి రైతుల అభిప్రాయం తీసుకొని మైనింగ్‌జోన్ రద్దు చేయించాలని కోరుతున్నారు.



క్వారీలు, క్రషర్లు పెట్టడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న వ్యాపారులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

» జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం, జనవరి 3: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధి కప్పాడులో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని దరఖాస్తులు తీసుకున్నారు. కాగా, దరఖాస్తులో బ్యాంకు అకౌంట్ వివరాలు అడగలేదని పలువురు ఆమె దృష్టికి తీసుకురాగా.. విచారణ అనంతరం అర్హులనుంచి బ్యాంకు అకౌంట్ వివరాలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు రైతు బంధు పథకం కింద సాయం పొందుతున్నవారు రైతు భరోసాకు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, కొత్తవారు మాత్ర దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే రేషన్ కార్డులేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో అడిగిన వివరాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని తప్పులు దొర్లకుండా నింపాలన్నారు. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన జనానికి సిబ్బంది, వాలంటీర్లు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, ఎంపీడీవో వెంకటమ్మ, సర్పంచ్ సామల హంసమ్మ, ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డి, ఉప సర్పంచ్ మునీర్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కప్పాడు గ్రామస్తులు

రైస్‌మిల్లు అనుమతులు రద్దు చేయండి

ఎలిమినేడు శివారులో రైస్‌మిల్లు ఇండస్ట్రీ గోదాం పేరుతో అనుమతులు తీసుకుని రైస్ మిల్ నిర్మాణం చేస్తున్నారని, దాని అనుమతులు రద్దు చేయాలని కప్పాడు గ్రామస్తులు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ రైస్‌మిల్ ఏర్పాటు చేస్తే దుమ్ము, ధూళితో జనం ఇబ్బంది పడతారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

'శంషాబాద్ ఆర్జీఐఏ' సీఐగా బాలరాజు బాధ్యతల స్వీకరణ



శంషాబాద్, జనవరి 3 : శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ సీఐగా బాలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఆర్. శ్రీనివాస్ ఒక కేసు విషయంలో తప్పుగా వ్యవహరించిన ఆరోపణతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మోహంతి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఆయన స్థానంలో నూతనంగా నియమితులైన బాలరాజు సీఐగా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

కొత్తూర్ ఇన్‌స్పెక్టర్‌గా నర్సింహారావు..



కొత్తూర్, జనవరి 3: కొత్తూర్ ఇన్‌స్పెక్టర్‌గా వి.నర్సింహారావు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందుకు ఇక్కడ విధులు నిర్వహించిన కోరం శంకర్‌రెడ్డి సైబరాబాద్ కమిషనరేట్‌లోని నార్కోటిక్స్‌కు బదిలీ అయ్యారు. నర్సింహారావు కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. కొత్తూర్‌కు బదిలీపై వచ్చారు.

'దాడుల సంస్కృతి బీఆర్ఎస్‌దే'

కొత్తూర్, జనవరి 3: దాడులు చేయడం బీఆర్ఎస్ పార్టీ సంస్కృతి అని, తాము ఎవరిపైనా దాడులు చేయలేదని కొత్తూర్ మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జేపీదర్గా వద్ద బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాడులు చేసే చరిత్ర బీఆర్ఎస్ పార్టీకి ఉందని, కాంగ్రెస్ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని అన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులపై చిల్లర ఆరోపణలు చేశారని, వాటిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. సుపారి రాజకీయాల కర్మ బీఆర్ఎస్ నాయకులకు చెల్లుతుందన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమై ఎంపీఎస్ రిసార్టుకు రావడంతో వారికి ఆశ్రయం కల్పించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ సూచన మేరకు మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు అతని అనుచరులు బుధవారం తెల్లవారుజామున 3.00గంటలకు రిసార్టుకు చేరుకుని దౌర్జన్యాలకు పాల్పడేందుకు సిద్ధమై, ప్రధాన గేట్లు బద్దలు కొట్టేందుకు ప్రయత్నించారని అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ నాయకులపై దాడులు చేశారని ఆరోపించారు. ఇన్ముల్‌నర్వ మీదుగా వెళ్తున్న తమకు చైర్మన్ అతని అనుచరులు తారసపడడంతో ఎందుకు దౌర్జన్యం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిపారు. చైర్మన్‌తో పాటు అతని అనుచరులు తనతో పాటు, తన అనుచరులపై అకారణంగా దాడి చేసేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించడం జరిగిందన్నారు. నాయకులు బాబర్‌ఖాన్, హరినాథ్‌రెడ్డి, రఘు, అంబటి ప్రభాకర్, దేవేందర్ ముదిరాజ్, సురేందర్ ఉన్నారు.

సావిత్రిబాయి జీవితం ఆదర్శనీయం

- ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు
- ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

షాద్‌నగర్ అర్బన్, జనవరి 3 : మూఢనమ్మకాలు, కుల వివక్ష, అంటరానితనం కురుకుపోయిన సామాజిక రుగ్మతులను సావిత్రిబాయి పూలే రూపుమాపి, సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే సావిత్రిబాయికి బీజేపీతో పాటు వామపక్ష పార్టీల నాయకులు సావిత్రిబాయి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఫ రూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీష్, జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, భార్గవ్‌కుమార్ రెడ్డి, బీజేపీ నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, చెట్ల వెంకటేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, పేట అశోక్, వంశీకృష్ణ, సీపీఎం నాయకులు రాజు, శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, రాజశేఖర్ తదితరులున్నారు.

షాబాద్ : మహిళల తేజోమూర్తి, భారత తొలి ఉపాధ్యాయురాలు, తొలి సామాజిక విప్లవకారిణి, కులవ్యవస్థకు చమరగీతం పాడిన సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని బీఎస్పీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బర్క కృష్ణయాదవ్, షాబాద్ సర్పంచ్ తమ్మలి సుబ్రమణ్యేశ్వరీరవీందర్ అన్నారు. సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకొని మండలంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆమె విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. బీఎస్పీ మండలాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు కర్రె శ్రీశైలం, శ్రీనివాస్, చందు, నర్సింహులు, జంగయ్య తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : మహిళా ఉద్యమకారిణి సావిత్రి బాయిపూలే జయంతిని ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులతోపాటు బీఆర్ఎస్ నాయకులు కానుగుల మహేష్, భర్తాకి రాజు, గణేష్, వీరేష్, తదితరులున్నారు.



అమనగల్లు: కొనాపూర్ పాఠశాలలో నిర్వహించిన జయంతి వేడుకలో పాల్గొన్న సంజీవ, తదితరులు



షాద్‌నగర్‌అర్బన్ : సావిత్రిబాయి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కడ్తాల : సావిత్రిబాయి పూలే జీవితాన్ని, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్‌లు అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పిప్పళ్ల వెంకటేశ్, అన్మాస్‌పల్లి చౌరస్తాలో యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్‌ల ఆధ్వర్యంలో సావిత్రి బాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ గోపాల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు అశోక్, గణేశ్‌గౌడ్, రాంచంద్రయ్య, చందోజీ, ఉపాధ్యాయినులున్నారు.



చేవెళ్ల : సావిత్రి జయంతిలో అధ్యాపకులు, విద్యార్థులు

ఆమనగల్లు : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి సంజీవ కోనాపూర్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సావిత్రిబాయి జయంతిలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్పంచ్ మల్లమ్మయాదయ్య, ఉపసర్పంచ్ శ్రీను, నాయకులు లక్ష్మయ్య, కుమార్, శ్రీశైలం, శేఖర్, మల్లేశ్, రమేశ్ తదితరులున్నారు.

తలకొండపల్లి : వెల్జాల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి జయంతి వేడుకలకు మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ హాజరై సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, హెచ్ఎంలు రజాక్, శేఖర్, నీల, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, పరమేశ్, ప్రవీణ్, చిట్టెమ్మ, కల్పన, పెర్సిస్, పద్మ పాల్గొన్నారు.

చేవెళ్ల : దేశంలో తొలి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని చేవెళ్ల సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, అంబేడ్కర్ అవార్డు గ్రహీత నారాయణ్‌దాస్, సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత మాణెమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సాయివిత్రిబాయి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎండీ మాక్బూల్, మండల మహిళా అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు కృష్ణ, శివ, ఆనందం, పెంటయ్య, లలిత, భాగ్యమ్మ, బలమణి పాల్గొన్నారు.

కందుకూరు : సావిత్రి బాయి ఆశయాలను ప్రతీ ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గందు నర్సింహ అన్నారు. సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకొని మండలంలోని మీర్కాన్‌పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించగా ఆయన హాజరయ్యారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో గల పాఠశాలల్లో జయంతిని జరుపుకున్నారు. నాయకులు సాయిలు, ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు కేఎం శ్రీధర్, బి.శ్రీనివాస్, హరిప్రసాద్, అనిల్, రాంచందర్, నరోత్తంరెడ్డి, సుచరిత, భాగ్యలక్ష్మి, మంగ, యాదీశ్వర్, బషీర్, తదితరులున్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

కేశంపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జయంతి వేడుకలు నిర్వహించారు. కేశంపేట, కొత్తపేట జడ్పీహెచ్ఎస్, మండల వనరుల భవనంలో సావిత్రిబాయి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, హెచ్ఎం విద్యావతి, ఉపాధ్యాయులు విరారెడ్డి, అశోక్‌రెడ్డి, ఫ్లోరెన్స్, సునిత, సీఆర్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : సావిత్రిబాయి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు

క్రైం కార్నర్

మనస్తాపంతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

షాబాద్, జనవరి 3 : మనస్తాపంతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. అంతారంనకు చెందిన జట్టా మహేష్(35) కుటుంబానికి చెందిన ఆస్తి పంపకాల విషయంలో గొడవ జరగడంతో మనస్తాపం చెందాడు. దాంతో బుధవారం తన వ్యవసాయ పొలం వద్దకు చేరుకొని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలున్నారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



చౌదరిగూడం, జనవరి 3: ఆర్థిక సమస్యలతో చితికిపోయిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పూనుకున్నాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. చౌదరిగూడ మండలం పద్మారం గ్రామానికి చెందిన బొమ్మగళ్ల నర్సింలు(30), భార్య శివలీల, కూతురు శ్రీజ, సిద్దూలు ఉన్నారు. కాగా, నర్సింలుకు 30 గంటల వ్యవసాయ పొలం ఉంది. అందులో పత్తిని సాగు చేశాడు. కానీ, ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడంతో పాటు పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చలేనేమోనన్న బాధతో తరచూ బాధపడేవాడు. ఈక్రమంలో గత నెల 31న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పూనుకున్నాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్ఐ సక్రం తెలిపారు. మృతుడి భార్య శివలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి తాళాలు విరగ్గొట్టి చోరీ

- 2 తులాల బంగారు గొలుసు, 20 తులాల వెండి అపహరణ

శంషాబాద్ రూరల్, జనవరి 3 : ఇంటి తాళం విరగ్గొట్టి రెండు తులాల బంగారు అభరణాలు, 20 తులాల వెండి వస్తువులు దోచుకెళ్లిన ఘటన బుధవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో నివాసముండే నవీన్‌కుమార్ ఈ నెల 2న కిస్మత్‌పూర్‌లోని అత్తగారింటికి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున నవీన్‌కుమార్ అన్న నర్సింహాచారి ఉదయం ఐదున్నర గంటలకు నిద్ర లేద్రలేచి కిందికి వచ్చి చూడగా.. ఇంటి తాళాలు విరగ్గొట్టి ఉండటం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో బట్టలు చిందరవందరగా ఉండటంతో నవీన్‌కుమార్‌కు ఫోన్ చేయగా వచ్చి చూశాడు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, 20 తులాల వెండి వస్తువులు, కొంత నగదు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైసమ్మ ఆలయంలో చోరీ

శంషాబాద్ రూరల్, జనవరి 3 : మండల పరిధిలోని బహదూర్‌గూడలోని మైసమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు, వెండి వస్తువులను దొంగిలించారు. బుధవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బహదూర్‌గూడకు చెందిన ఏనుగు బుచ్చిరెడ్డి తన పొలంలో మైసమ్మ గుడిని కట్టించుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయంలో అమ్మవారి 2 గ్రాము ముక్కుపుడక, 20 తులాల వెండి తొడుగు అపహరించారు. బుచ్చిరెడ్డి శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



కడ్తాల్, జనవరి 3: మండల పరిధిలోని మైసిగండికి చెందిన రామావత్ రాజేందర్ అదృశ్యమైనట్లు సీఐ శివ ప్రసాద్ తెలిపారు. కిరాణ వ్యాపారి అయిన రాజేందర్ 2023 డిసెంబరు 19న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. బంధువులు, చుట్టుపక్కల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు రాజేందర్ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

మతిస్థిమితం లేని విద్యార్థి..



శంషాబాద్ రూరల్, జనవరి 3 : మతిస్థిమితం లేని విద్యార్థి అదృశ్యమైన సంఘటన బుధవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్ద గోల్కొండ గ్రామానికి చెందిన దేశపాగ శ్రీనివాస్, మాధవి దంపతులకు ముగ్గురు సంతానం. కాగా, మూడో కుమారుడు నవీన్(15)కు మతిస్థిమితం లేదు. డిసెంబరు 31న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీల వర్తింపు

- ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు
- 'అభయహస్తం' దరఖాస్తుల స్వీకరణ

షాబాద్, జనవరి 3 : కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలు అర్హులందరికీ అందుతాయని, ఇదే ప్రజాపాలన ఉద్దేశ్యమని డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యదర్శి అరుణ, అంగన్‌వాడీ టీచర్ పద్మ గ్రామస్తులు పాల్గొన్నారు.



కడ్తాల్ : ఎక్వాయిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ సుగుణ, ఎంపీటీసీ ఉమావతి, ఎంపీడీవో

చేవెళ్ల : అభయహస్తం ఐదు గ్యారంటీలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీవో విఠలేశ్వర్, నాంచేరి సర్పంచ్ కొత్తపల్లి సక్కుబాయి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉపసర్పంచ్ మధు, కార్యదర్శి శివకుమార్, ఏఈ జానీ మొయినోద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ బాలకృష్ణ, వార్డుసభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు ఉన్నారు.

కొందుర్గు : మండల పరిధిలోని టేకులపల్లి, ముట్పూర్, లక్ష్మీదేవిపల్లి, ఆగిర్యాల గ్రామాల్లో 1006 మంది దరఖాస్తు చేసుకున్నారు కార్యక్రమాల్లో ఎంపీడీవో అంజనేయులు, తహసీల్దార్ రమేష్ కుమార్, సర్పంచులు పవిత్రాదేవి, నర్సింలు, నర్సింహారెడ్డి, నాయకులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



షాబాద్ : సంకేపల్లిగూడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి : ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు సోన శ్రీనునాయక్, మల్లమ్మ యాదయ్య, ఎంపీడీవో పారుఖ్‌హుస్సెన్‌లు అన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల, కోనాపూర్‌లో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు సీతారామ్, రవితేజ, కృష్ణయ్య, ఎంపీవో శ్రీలత, ఎంపీటీసీ సరితపంతూనాయక్, తదితరులున్నారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి, గోవిందాయిపల్లి, ముద్విన్, మర్రిపల్లిలో సర్పంచ్‌లు సుగుణసాయిలు, రవీందర్, నక్కపోతు యాదయ్య, భాగ్యమ్మ జంగయ్యల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీవో ముదసూధనాచారి, ఏఈలు పరమేశ్, నరేందర్, ఏపీఎం రాజేశ్వరి, ఎంపీటీసీలు ఉమావతి, నిర్మలాదేవి, డీటీ తదితరులున్నారు. తలకొండపల్లి మండలం గౌరిపల్లి, బల్కులపల్లి తండా, పాతకోట తండా, పడమటి తండా, కోరింత కుంట తండా, వీరన్నపల్లిలో సర్పంచ్‌లు అనురాధ, అలివేలు, లింగమ్మ, బుజ్జి, రాములు, నాగమణిల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీకాంత్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఏఈలు కటారియా, విద్యాసాగర్, ఏవో రాజు, అధికారులు, నాయకులు తదిరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

షాద్‌నగర్‌అర్బన్/కేశంపేట, జనవరి 3: షాద్‌నగర్ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో కొనసాగుతున్న అయ్యప్పలకు బుధవారం పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నదానం చేశారు. కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ప్రత్యేక పూజచేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, అయ్యప్పల ఆశీర్వాదం తీసుకున్నారు. పాలమూరు నారాయణ రెడ్డి, విజయభాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, నర్సింహయాదవ్, ఆకుల ప్రదీప్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేశంపేట మండలం ఇప్పలపల్లిలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు ఇరుముడులు కట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎన్నికలలో విజయం సాధించినందుకుగాను ఇరుముడులలో పాల్గొన్న భక్తులకు మాజీ సర్పంచ్ కృష్ణవేణి భర్త వెంకటేష్ అన్నదానం చేశారు.




అన్నదానం సందర్భంగా నమస్కరిస్తున్న విష్ణువర్ధన్

ఉన్నత విద్యకు వీజేఐటీ విశేష కృషి

- కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే పల్లా

మొయినాబాద్ రూరల్, జనవరి 3 : విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల(వీజేఐటీ) విశేష కృషి చేస్తోందని జనగామ ఎమ్మెల్యే, విద్యాజ్యోతి గ్రూపు విద్యాసంస్థల చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలోని కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గతంతలో పనిచేసిన అధ్యాపక బృందాలను సన్మానించారు. ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, అధ్యాపక బృందంతో పాటు పూర్వ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు

'అయోధ్య' అక్షింతలతో ర్యాలీ



చేవెళ్ల : మల్కాపూర్ గ్రామంలో అక్షింతలతో స్వాములు, నాయకులు

కడ్తాల్, జనవరి 3: అయోధ్య అక్షింతలతో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ సభ్యులు, కర సేవకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి ప్రధాన వీదుల మీదుగా బస్టాండ్ వరకు జై శ్రీరామ్ నినాదాలతో ర్యాలీ కొనసాగింది. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికీ అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, కర సేవకులు బాచిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, గూడూరు భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్, దోనాదుల మహేశ్, అశోక్‌రెడ్డి, మన్యనాయక్, వెంకటేశ్, రాందాస్ నాయక్, భగీరథ్, యాదయ్యగౌడ్, నర్సింహ్మగౌడ్, యాదగిరి, మోహన్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, బుచ్చయ్య, సాయిరెడ్డి, శ్రీధర్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల : అక్షింతలతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

షాబాద్ : శ్రీరామ జన్మభూమిలో భవ్య రామ మందిరం నిర్మాణంతో దేశ ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుందని ముద్దెంగూడ ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎర్రోనిగూడలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామంలో పంపిణీ చేశారు. గ్రామస్థులు జైపాల్‌రెడ్డి, గురుస్వామి, రఘురాంరెడ్డి, పరమేష్ తదితరులున్నారు.

చేవెళ్ల : శ్రీరామ జన్మభూమి అక్షింతల వితరణ కార్యక్రమం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నిర్వహించారు. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పిలుపు మేరకు ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శ్రీరామ జన్మభూమి అక్షింతల కలశ వితరణ కార్యక్రమం గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో గ్రామానికి చెందిన అయ్యప్పస్వాములు, వివిధ పార్టీల నాయకులు పూజలు చేయించారు. వారు మాట్లాడుతూ అక్షింతలను గడపగడపకూ తీసుకెళ్లాల న్నారు. ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బక్క రెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు శేరి శివారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు దేవుని శర్వలింగం, ఇంద్రాసేనా రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాల్గని నరేందర్‌గౌడ్, సీహెచ్ వెంకటేశ్, శ్రీకాంత్, నాయకులు చామంతి శివరాజ్, గోపాల్, శివగౌడ్, మహేందర్‌గౌ డ్, శంభులింగచారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐ బద్యనాథ్‌కు సన్మానం

ఆమనగల్లు, జనవరి 3: ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ను బుధవారం కేఎన్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గిరిజన నాయకులు, యువకులతో సీఐ నికలిసి పూలమాలలు, శా లువాలతో సత్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు జై రామ్‌నాయక్, రాజ్‌కుమార్, మల్లేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కడ్తాల్ :** కడ్తాల మండల కేంద్రంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు ముంతాజ్, లలిత, రంగారెడ్డిలు తెలిపారు. స్థానిక గూడూరు కేశవ రెడ్డి గార్డెన్‌లో నిర్వహించే కడ్తాల, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మూడు మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరు కావాలని ఈ సందర్భంగా వారు కోరారు.
- **ఆమనగల్లు :** మండల పరిధిలోని పోలెపల్లి గ్రామానికిచెందిన గండి కోట వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని బుధవారం ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో పలువురు వార్డు సభ్యులు, నాయకులు తదితరులు ఉన్నారు.
- **తలకొండపల్లి :** మండల పరిధిలోని బల్మలపల్లి గ్రామం పంచాయతీ కొలికి రాళ్ల తండాలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జాభవాని దేవాలయ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూత నందించారు. ఉప్పల ట్రస్ట్ చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ సమకూర్చారు. బుధవారం ట్రస్ట్ స భ్యులు ఆలయ నిర్వాహకులు వాటిని అందజేశారు. నాయకులు హరి, కిషన్, ర వి, గోపాల్, శ్రీను, శంకర్, తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలపై ఉద్యమించాలి



సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్, బాషా

యాచారం, జనవరి 3 : బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజాసమస్యలను పరిష్కరించేవరకూ ఉద్యమించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అధికారం కోసం అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తీర్చకుంటే జనం అధికారం నుంచి దూరం చేస్తారనే విషయం గమనించాలన్నారు. బుధవారం యాచారం మండల బీఆర్ఎస్ అధ్యక్షకార్యదర్శులు కె.రమేష్, పి.బాషాలు నగరంలోని సబితారెడ్డి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కడ్తాల్, జనవరి 3 : మండల పరిధిలోని బోయిన్ గుట్ట తండాలో బుధవారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. జీఎస్ఆర్ యువసేన, దశరథ్ నాయక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, సర్పంచ్ భారతమ్మ నర్సింహగౌడ్‌లతో కలిసి దశరథ్ నాయక్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ఆయన కోరారు. మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు అంజినాయక్, సోమ్లా, కిషన్, శ్రీను, బాలాజీ, విజయ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రన్నింగ్ పోటీలు

కడ్తాల్ మండల కేంద్రంలో బుధవారం విద్యార్థినిలకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నిర్వాహకుడు రాఘవేందర్ లతో కలిసి జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ పోటీలను ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినిలు రన్నింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేత విద్యార్థినిలకు బహుమతులు ప్రదానం చేశారు. మండల కో-ఆప్షన్ సభ్యులు జహంగీర్‌బాబా, ఎంపీటీసీ గోపాల్, నాయకులు చందోజీ, భాస్కర్ రెడ్డి, జహంగీర్‌అలీ, రాయకంటి భిక్షపతి, శ్రీనునాయక్, కేశని యాదయ్య, నర్సింహ, రామచంద్రయ్య, వెంకటేశ్, మహేశ్, నాగరాజు, గణేశ్,కుమార్, శివ, రాఘవులు, అంజి, ప్రశాంత్, నరేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ దశరథ్ నాయక్